14న జార్జిరెడ్డి వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజిక్స్ విభాగం పూర్వ విద్యార్థి జార్జిరెడ్డి 52 వ వర్ధంతి ఈనెల 14న నిర్వహించనున్నారు. వర్ధంతి సందర్భంగా జార్జ్ మిత్రులు, పీడీఎస్‌యూ పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో 14న ఉదయం 6 గంటలకు ఓయూ ఆర్ట్స్ కాలేజీ నుంచి ఇంజినీరింగ్ కిన్నెర హాస్టల్ వరకు మార్నింగ్ వాక్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఓయూలో అధ్యాపక నియామకాలు హుళక్కే..

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ ఏడాది చివరినాటికి వరుసగా ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ ఖాళీగా ఉన్న అధ్యాపక నియామకాలకు అడ్డంకిగా మారనున్నాయి. అధ్యాపకుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న ఓయూలో కనీసం కాంట్రాక్టు అధ్యాపకులను కూడా నియమించకుండా గత ప్రభుత్వం 2014లో జీవో జారీ చేసింది. కేవలం పార్ట్‌టైమ్ అధ్యాపకులచే బోధన కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రొఫెసర్ల కొరత కారణంగా పీహెచ్‌డీ ప్రవేశాలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా వివిధ ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఓయూ విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు.

కుంటుపడుతున్న పౌరసేవలు

- లష్కర్‌లో జీహెచ్‌ఎంసీ పనితీరు
- ఖాళీగా జీహెచ్‌ఎంసీ కార్యాలయం



జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ కార్యాలయం

సికింద్రాబాద్: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం బోసిపోయింది. కొందరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఇంకొందరు అటెండర్లు మినహా కార్యాలయంలో ఉద్యోగులు తక్కువ సంఖ్యలో విధులకు హాజరవుతున్నారు. ఎన్నికల విధుల్లో కొన్ని విభాగాల అధికారులు, ఇతర విభాగాల అధికారులు, ఉద్యోగులు పర్యటనలు, సందర్శనల పేరుతో కార్యాలయానికి వీలున్నప్పుడు మాత్రమే వచ్చి వెళ్తున్నారు. పనిదినాలు, కార్యాలయాల వేళల్లో పలు విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండకపోతుండటంతో మొత్తంగా పౌరసేవలకు విఘాతం కలుగుతుంది.

ఎన్నికల విధుల్లో కమిషనర్లు..

సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్ కార్యాయంతో పాటు సికింద్రాబాద్, బేగంపేట సర్కిల్ కార్యాలయాలున్నాయి. జోనల్ కమిషనర్ మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల అధికారిగా, సికింద్రాబాద్, బేగంపేట సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల సహాయ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్నారు.

పాటించని కార్యాలయాల వేళలు..

ఉన్నతాధికారులు ఎన్నికల విధుల్లో ఉండటంతో కిందస్థాయి అధికారులు, ఉద్యోగులు కార్యాలయ వేళపాళలు పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్‌ఎంసీలోని కొన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు మాత్రం ఎన్నికల విధుల సందడితో కనిపిస్తున్నారు. ఆయా విభాగాల్లో ఎటు చూసినా ఓటర్ల నమోదు, పోలింగ్ స్టేషన్లలో సదుపాయాలు, సమీక్ష సమావేశాలు వంటి విధులతో బిజీగా ఉంటున్నారు.

ఉద్యోగుల కొరత..

జీహెచ్‌ఎంసీ జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో మొదటి నుంచి అధికారులు, ఉద్యోగుల కొరత ఉంది. ఎప్పటికప్పుడు పదవీ విరమణ చేస్తున్న అధికారులు, ఉద్యోగుల స్థానాల్లో నియామకాలు జరగకపోవడంతో జీహెచ్‌ఎంసీ పరిపాలనా వ్యవహారాలు క్రమేణా ఇబ్బందికరంగా మారుతున్నాయి. అరకొర ఉద్యోగులు, అధికారులకు తోడుగా అదనపు విధులు తోడవుతుండటంతో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం కనిపించడం లేదు. గతేడాది నవంబర్ నుంచి ఇప్పటి వరకు ఎక్కువ మంది జీహెచ్‌ఎంసీ అధికారులు, ఉద్యోగులు అదనపు విధులకే పరిమితం అవుతున్నారు. అరకొరగా ఉన్న అధికారులు, ఉద్యోగులు కూడా జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలున్నాయి.

పౌరసేవల్లో జాప్యం...

పార్లమెంట్ ఎన్నికల సాకుతో మరోసారి పౌరులకు సత్వరమే అందించాల్సిన మున్సిపల్ సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఎన్నికల షెడ్యూల్ ఇడుదల రోజు నుంచి మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులను ప్రసన్నం చేసుకోవడం ఈ ప్రాంత ప్రజలకు కష్టంగా మారుతోంది. ట్యాక్స్, పట్టణ ప్రణాళిక విభాగాల్లో ఈ సమస్యలు తీవ్రంగా ఉంటున్నాయి. భవన నిర్మాణ అనుమతుల జారీలో ఆలస్యంతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం అధికారులకు సమయం దొరకడం లేదనే ఆరోపణలున్నాయి. కమ్యూనిటీహాళ్ల నిర్మాణం, రహదారుల మరమ్మతులు, విస్తరణ తదితర అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మాత్రమే జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి రావాలని అటెండర్లు సందర్శకులకు చెబుతున్నారు.

వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: మండు వేసవిలో పాదచారుల, వాహనదారుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశ్యంతో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు తార్నాక సత్యసాయి సేవా సంస్థ మహిళా విభాగం ఆధ్వర్యంలో తార్నాక, లాలాపేట ప్రధాన రహదారిలో బుధవారం చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు చల్లని తాగునీరు, మజ్జిగను పంపిణీ చేశారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. సత్యసాయి సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కార్మిక సంఘం నాయకులు మోతే శోభన్‌రెడ్డి, మీనాక్షిదేవి, సత్యసాయి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక నృత్యాలు



సనత్‌నగర్ : జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలను కాలనీ 4వ రోడ్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆహుతులను అలరించాయి. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకలకు సరోజినీదేవి కంటి ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జెక్‌కాలనీ మాజీ అధ్యక్షుడు సీహెచ్.అనంతరెడ్డి, నంది అవార్డు గ్రహీత ఇనగంటి లావణ్య, మోడల్‌కాలనీ ఉపాధ్యక్షుడు జీఎస్‌టీ శాయిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లు ప్రసాద్, రాజశేఖర్ చందులు అతిథులను సన్మానించారు. కాగా చిన్నారులకు జ్ఞాపికలతో పాటు బహుమతులను ప్రదానం చేశారు. కాలనీ ప్రతినిధులు సురేష్‌గౌడ్, నాగిరెడ్డి, భాషా, శివారెడ్డి, వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రావు, డీఎస్‌రావు, విశ్వనాథరాజు, ప్రసాదరాజు, లక్ష్మారెడ్డి, సునీల్ తదితరులున్నారు.

ఓటింగ్‌కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

ఎన్నికల అధికారి హేమంత్ కేశవ్ పాటిల్



సికింద్రాబాద్: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్ కోరారు. బుధవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నామినేషన్లు, పోలింగ్‌కు ముందు పోలింగ్ అనంతరం రాజకీయ పార్టీల నాయకులు పోషించాల్సిన పాత్ర గురించి వివరించారు. పోస్టల్ బ్యాలెట్లను వినియోగించాల్సిన తీరు, పోలింగ్‌స్టేషన్లలో ఇబ్బందులు అధికారుల దృష్టికి తీసుకురావడం వంటి పద్ధతులను వివరించాలన్నారు. నామినేషన్లు వేయాల్సిన సమయంలో పాటించాల్సిన నిబంధనలు, పోలింగ్, లెక్కింపు సమయాల్లో సహకరించాల్సిన పద్ధతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజెప్పారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, వారి సలహాలు సూచనలను స్వీకరించారు. సహాయక ఎన్నికల అధికారులు వీరారెడ్డి, ఎల్లారెడ్డి, సుభాష్‌రావు, సమ్మయ్య, ఎన్నికల విభాగం ఇన్‌చార్జి భుజేందర్‌బాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజసుందర్, రాజేందర్‌యాదవ్, ప్రవీణ్‌లాల్, భాస్కర్‌గిరి, భరద్వాజ్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో మైనర్లు పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలి

అడ్డగుట్ట: ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో మైనర్లు పాల్గొనకుండా ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచారాల్లో పిల్లలను కూడా తీసుకెళ్తున్నారన్నారు. బస్తీల్లో రాజకీయ పార్టీలు పంచుతున్న మద్యం, మాదకద్రవ్యాలలో పిల్లలను భాగస్వామ్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఎండలు, రోడ్‌షోల్లో పాల్గొనే పిల్లలు తొక్కిసలాటలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలలను ప్రచారంలో ఉపయోగించడం చట్టరిత్యా నేరమని పేర్కొన్నారు. బాలల హక్కులను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నామన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



మిత ఆహారాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, మధ్యాహ్న మిత భోజనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్లు వయస్సును సైతం లెక్క చేయకుండా ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 2011 వేసవిలో ప్రారభించిన మధ్యాహ్న మిత భోజనాన్ని ప్రతి ఏటా కొనసాగిస్తూ.. వస్తున్నారన్నారు. వయోవృద్ధులు రెండు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి దాతలు కూడా ముందుకు రావడం అభినందనీయమన్నారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పార్థసారధి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ సభ్యులు అధ్యక్షుడు మాణిక్‌రావు పాటిల్, కృష్ణారెడ్డి, సహదేవ్‌గౌడ్, స్థానిక నేతలు షాబాద్ శ్రీనివాస్‌రావు, మధుసూదన్‌రావు, వనం శ్రీనివాస్, పియూష్‌గుప్తా, కుమార్ తదితరులున్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం



లాలాపేటలో ఎన్నికల ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న కిషన్‌రెడ్డి

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బుధవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తార్నాక, మెట్టుగూడ ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లాలాపేటలో ప్రారంభమైన ప్రచార కార్యక్రమంలో కిషన్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై సత్యానగర్, శ్రీపురికాలనీ, చంద్రబాబునగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. లక్ష్మీనగర్, పాత లాలాపేట ప్రాంతాల్లో ఓపెన్‌టాప్ జీపుపై ప్రజలకు అభివాదం చేస్తూ.. వెళ్లారు. వివేకానంద చౌక్‌వద్ద కార్నర్ మీటింగ్‌లో ప్రజలను ఉద్దేశించి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఢిల్లీ ఎన్నికలు, కమలం గుర్తుకు ఓటేసి నరేంద్ర మోదీని మరోసారి ప్రధాన మంత్రి, తనను సికింద్రాబాద్ ఎంపీగా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. భారతదేశాన్ని అన్ని రంగాల్లో ప్రధానమంత్రి అభివృద్ధి చేశారని, ప్రపంచంలో భారతదేశ గౌరవాన్ని పెంచారని తెలిపారు.

ఉచితంగా టీకాల పంపిణీ..

కరోనా విపత్కర పరిస్థితిలో దేశ ప్రజలందరికీ ఉచితంగా కరోనా టీకాలను పంపిణీ చేశారన్నారు. దాదాపు 500ల ఏళ్ల నుంచి గుడిసెలో ఉన్న రాముడికి అయోధ్యలో భవ్యమైన మందిరాన్ని కట్టింది నరేంద్ర మోదీ అని అన్నారు. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారని, అది నేటికి కొనసాగుతుందని వివరించారు. నిరుద్యోగ యువతకు ముద్రాలోన్లు, మహిళాసంఘాలకు రూ.20 లక్షల వరకు రుణాలు అందజేస్తున్నారని వివరించారు. ఉజ్వల పథకం కింద ప్రతి పేద కుటుంబానికి వంట గ్యాస్ కనెక్షన్లు, బ్యాంక్ ఖాతాలు ప్రారంభింపజేశారన్నారు. రైల్వేల అభివృద్ధి, ఎయిర్‌పోర్టులు అభివృద్ధి చేశారని తెలిపారు. ముస్లిం మహిళలకు ఇబ్బందికరంగా మారిన ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశామన్నారు. మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి, సికింద్రాబాద్ అసెంబ్లీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన గురుద్వారా కమిటీ ప్రతినిధులు

అమీర్‌పేట: ఖల్సాపంత్ 325వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమీర్‌పేట్‌లోని ప్రబంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో మూడ్రోజుల పాటు వైశాఖీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గురుద్వారా ప్రతినిధులు తెలిపారు. బుధవారం అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ దర్శన్ సింగ్, సర్దార్ సురేందర్‌సింగ్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలో వైశాఖీ ఉత్సవాలు అమీర్‌పేట వేదికగా జరుగుతాయని, ఈనెల 12 నుంచి ప్రారంభమయ్యే వేడుకలకు సిక్కులు, ఇతర మతాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో హాజరవుతారని చెప్పారు. మొదటి రోజున అమృత్‌పాన్ (హోలీ బాప్టిజన్) కార్యక్రమం ద్వారా సిక్కు మత గురువులు ప్రత్యేకంగా తయారు చేసిన పానీయాన్ని పిల్లలు, యువకులు, మహిళలకు పంచిపెడతారన్నారు. 13న విశాల్ దివస్, 14న కీర్తన్ దర్బార్ ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది శ్రీ గురుగోవిందసింగ్ వంశపారంపర్యంగా వస్తున్న 5 అరుదైన గుర్రాలు వేడుకల్లో పాల్గొంటాయని వివరించారు. అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్‌కు చెందిన సిక్కు మతగురువులు, మహారాష్ట్ర నుంచి మరాఠా జత్తా (భజన) బృందం కూడా వస్తుందన్నారు. ఉత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గురుద్వారా అధ్యక్షులు సర్దార్ లాహోర్‌సింగ్, సర్దార్ కుశ్వంత్‌సింగ్, చైర్మన్ అజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో బయటి వ్యక్తుల ఆగడాలు అరికట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: క్యాంపస్‌లోకి బయటి వ్యక్తుల ఆగడాలను అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు ఓయూను క్లోజ్డ్ క్యాంపస్‌గా తీర్చిదిద్ది బయటి వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. బైక్‌రైడింగ్స్, గంజాయి, మద్యం సేవించడం రియల్ ఎస్టేట్ దందాలు, తదితర అసాంఘీక కార్యక్రమాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లి సత్య, భగత్, శ్రీకాంత్, అశ్వన్ తదితరులున్నారు.

మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్‌లోని సుప్రసిద్ధమైన మల్లికార్జున దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. దేవాలయంలో బుధవారం జరిగిన పూజా కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తుల సందడితో దేవాలయ ప్రాంగణం సందడిగా మారింది. మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం సందర్భంగా బుధవారం దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన అగ్నిగుండాల కార్యక్రమంలో ఒగ్గు కళాకారులు, శివసత్తులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివసత్తులు, అర్చకులు, ఒగ్గు కళాకారులు నిప్పుల గుండంలో నడిచి వెళ్లారు. ఈ సన్నివేశాన్ని చూసేందుకు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు దేవాలయానికి తరలివచ్చారు. బుధవారం దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ హేమలత, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరాములు, నాగలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రిమహేష్, ఆలయ ఈఓ జ్యోతి, బీఆర్‌ఎస్ నాయకులు ఏసూరి మహేష్, వెంకటేషన్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మహిళ మృతి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మహిళ బుధవారం మృతి చెందింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 8వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై అపస్మారక స్థితి లో మహిళ పడి ఉంది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది. ఒంటిపై ఎరుపురంగు చీర, పసుపురంగు జాకెట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

వైద్యరంగానికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు

ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ విద్యార్థులతో సక్సెస్ మీట్



మాట్లాడుతున్న డాక్టర్ వెంకట్‌రెడ్డి

అమీర్‌పేట: సమాజంలో వైద్యరంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని వైద్యవృత్తిని వ్యాపారంగా మార్చకూడదని టీఆర్‌పీఎస్, ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.వెంకట్‌రెడ్డి అన్నారు. ఈవింగ్స్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ద్వారా కిర్గిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసి మొదటి ప్రయత్నంలోనే ‘ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ లైసెన్సింగ్’ పరీక్షలో అర్హత సాధించిన వైద్యులతో బుధవారం అమీర్‌పేటలో సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో వైద్యసేవలు అందించేందుకు ఆసక్తిని చూపాలన్నారు. ప్రజలకు సేవా చేయాలన్న దృక్పథంతో వైద్యవృత్తిని ఎంచుకునే వారు కొందరైతే డబ్బు సంపాదనే ధ్యేయంగా మరి కొందరు వైద్య వృత్తిని ఎంచుకుంటున్నారని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే నిరుపేదలకు వైద్యం నేటికి అందని ద్రాక్షగా మారిందని గుర్తు చేశారు. కిర్గిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన 10 మంది విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ప్రోసియం సీఈఓ భానుప్రకాష్, వసిష్ఠ గ్రూప్ జనరల్ మేనేజర్ వంశీచంద్ర, ఖలీల్ అహ్మద్ తదితరులున్నారు.

పింగళి వెంకయ్య చరిత్రను భావితరాలకు అందించాలి



గాంధీభవన్ ఇన్‌చార్జికి చిత్రపటాన్ని అందజేస్తున్న కోదండరెడ్డి

ముషీరాబాద్: జాతీయపతాక రూపకర్త పింగళి వెంకయ్య జీవితచరిత్రను భావితరాలకు తెలియజేసేవిధంగా పాలకులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి సూచించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న అవార్డు ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ పరంగా కృషి చేస్తామన్నారు. రాంనగర్ గుండులోని పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ కె.హెచ్.ఎస్.జగదాంబ, శ్యామలరావు ఆధ్వర్యంలో బుధవారం గాంధీభవన్‌లో పింగళి వెంకయ్యతోపాటు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న పలువురు మహనీయుల చిత్రాలతో కూడిన ఫొటోను కోదండరెడ్డి ద్వారా గాంధీభవన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాంధీభవన్ ఇన్‌చార్జీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్‌రావు, టీపీసీసీ కార్యదర్శి జీఎన్ కేశవ్, ట్రస్ట్ సభ్యులు జశ్వంత్, శ్రీకాంత్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

‘కితాబ్ లవర్స్ బుక్‌ఫెయిర్’ ప్రారంభం



కితాబ్ లవర్స్ బుక్ ఫెయిర్ ప్రారంభిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: సాహిత్య అనుభూతిని కలిగించేలా ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ చక్కని అవకాశాన్ని కలిగించింది. అమీర్‌పేట మెట్రోస్టేషన్ బుక్‌ఫెయిర్‌కు వేదికైంది. బుధవారం ప్రారంభమైన బుక్‌ఫెయిర్ 14 వరకు కొనసాగనుంది. అందరినీ ఆకట్టుకునేలా ‘కితాబ్ లవర్స్ బుక్‌ఫెయిర్’ పేరిట దీనిని ఏర్పాటు చేశారు. కట్టిపడేసే నవలలు, జీవిత చరిత్రలు, ఉత్కంఠ భరితమైన సాహసాలు మొదలుకుని మనస్సుకు హత్తుకునే పిల్లల కథల వరకు అనేక పుస్తకాలను సందర్శకులు ఇక్కడ తిరగేయొచ్చు. 14వ తేదీ వరకు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు అమీర్‌పేట మెట్రోస్టేషన్ కాన్‌కోర్స్ లెవల్‌లో ఈ పుస్తక ప్రదర్శన కొనసాగనుంది. ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి, చీఫ్ స్ట్రాటెజీ ఆఫీసర్ మురళి వరదరాజన్ పాల్గొని మాట్లాడారు. పిన్న వయస్సులోనే 10 లైబ్రరీలను ఏర్పాటుచేసి ప్రధానిచే ప్రశంసలు అందుకున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆకర్షణ సతీష్ ఈ పుస్తక ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

చర్చి పాస్టరేట్ మెంబర్ మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్ : మెట్టుగూడ సెయింట్ మార్క్స్ చర్చి పాస్టరేట్ కమిటీ సభ్యుడు పసుపులేటి జార్జ్‌రేనాల్డ్ (55) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. చిలకలగూడ అన్నానగర్‌కు చెందిన జార్జ్‌రేనాల్డ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన మృతదేహాన్ని మెట్టుగూడలోని జార్జ్‌రేనాల్డ్ చర్చిలో ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. వైవీ బాలాజీ, శ్రీకాంత్, అశ్విన్‌కుమార్ తదితరులున్నారు.

వ్యక్తి జీవితంలో ‘కెమిస్ట్రీ’కి అధిక ప్రాముఖ్యం



ప్రొఫెసర్ కోదండరాంను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (లండన్) దక్కన్ విభాగం ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెమిస్ట్రీపై సమ్మర్ వర్క్‌షాపు తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్లో బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కోదండరాం హాజరై వర్క్‌షాపును ప్రారంభించి అనంతరం మాట్లాడారు. వ్యక్తి జీవితంలో రసాయన శాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సైన్స్ పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. ప్రోగ్రామ్ కో- ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసపాటి వర్క్‌షాపు ఉద్దేశం, లక్ష్యాలను వివరించారు. ఈ వర్క్‌షాపు 5 రోజుల పాటు కొనసాగుతుందని వివరించారు. డాక్టర్ పి.మోహన్‌రావు మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో సైన్స్‌పాత్ర ఎంతో కీలకమన్నారు. కరోనా టీకాను ప్రపంచంలోని ఇతర దేశాలకు భారతదేశం అందించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అనంతరం కోదండరాంను శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, నాగార్జుననగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జలేందర్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యదర్శి డా. టీవీ.రావు, డా. కె.ఎస్ తాళ్లూరి, డాక్టర్ ఆర్.బి.ఎస్ ప్రసాద్ తదితరులున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సదస్సులో విద్యార్థులతో కలిసి పాల్గొన్న డాక్టర్ మహి అశ్రా

కాచిగూడ: పౌష్టికాహారంతోనే పలు విధాలైన వ్యాధులను దూరం చేసుకోవచ్చని షెనాయ్ హాస్పిటల్స్ న్యూట్రిషన్ విభాగం హెడ్ డాక్టర్ మహి అశ్రా అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బర్కత్‌పురలోని శ్రీమతి ఎ. శ్యామలదేవి డిగ్రీ కళాశాలలో న్యూట్రిషన్‌పై విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. మంచి పౌష్టికాహారం తీసుకుంటే రక్తం వృద్ధి చెందుతుందని అన్నారు. మాంసం బదులు కూరగాయలు ఎక్కువగా తినాలని, కాలానుగుణంగా లభించే పండ్లను తీసుకోవాలని, స్థానికంగా దొరికే ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. సులభంగా జీర్ణమయ్యే, సూక్ష్మపోషకాలు లభించే పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. విటమిన్స్ లోపంతో కంటిచూపు మందగిస్తుందని, ఐరన్ లోపంతో రక్తహీనత, జ్ఞాపకశక్తి నశిస్తుందని, కాల్షియం లోపంతో ఎముకల పటుత్వం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ బి.లావణ్య కుమారి, లెక్చరర్లు దీప్తి, దీప, స్వాతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే ‘జలమండలి’ని ముట్టడిస్తాం

కాచిగూడ: స్థానిక శాంతినికేతన్ స్కూల్ లేన్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రెయిన్‌వాటర్ పనుల్లో సిబ్బంది అలసత్వంపై కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లోపిస్తే జీహెచ్‌ఎంసీ, జలమండలి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. బుధవారం రెయిన్‌వాటర్ పైపులైన్ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. వాటర్, సివరేజ్ పైపులు పగిలిపోయి కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం వల్ల మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.